# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త
పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో
మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 239 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 26 - 03 - 2026



# తెలంగాణలో ఇంధన కొరత లేదు

- తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఇంధన ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్ల 'నో స్టాక్' బోర్డులు
- ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్ల బోర్డులు వెలిశాయన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- క్యాన్లు, డబ్బాల్లో ఇంధనం నింపుకుంటే చర్యలు తీసుకుంటాం
- తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదన్న మంత్రి ఉత్తమ్
- పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో అపోహలు వద్దని ప్రజలకు విజ్ఞప్తి
- తెలంగాణలో వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం




**హైదరాబాద్ :** ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వల్లే బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయని, గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందిలేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ లభ్యత విషయంలో ప్రజలు అపోహలను నమ్మవద్దని కోరారు. చమురు కంపెనీలు కూడా సరిపడా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.తెలంగాణ - మిగతా 2 లో

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి



- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సవాల్
- మళ్లీ సీఎం అవుతానని రేవంత్ కలలు కంటున్నారని హరీశ్ ఎద్దేవా
- బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని వ్యాఖ్య
- కాంగ్రెస్ పార్టీ అందరినీ మోసం చేసిందని విమర్శ
- నియోజకవర్గాల పునర్విభజన వల్ల బీఆర్ఎస్ కే మేలు జరుగుతుందన్న హరీశ్

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు - మిగతా 2 లో




# రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు

- వచ్చే నెలలో డెలివరీ
- దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం చర్యలు
- అమెరికా మినహాయింపుల నేపథ్యంలో రష్యా నుంచి కొనుగోలు చేసిన రిఫైనరీలు
- ఇరాన్ చమురును కూడా కొనుగోలు చేసిన భారత్ రిఫైనరీలు


2 లో

# ఇరాన్‌పై 15,000 బాంబులు 3 వేల లక్ష్యాలపై దాడులు

- ఇజ్రాయెల్
- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్


2 లో

# పశ్చిమాసియా ఉద్రిక్తతల వాస్తవాలు వివరించనున్న కేంద్రం

- హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన కీలక భేటీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశం
- భారత్‌పై ఆర్థిక, భద్రతాపరమైన ప్రభావంపై పార్టీలకు వివరించనున్న ప్రభుత్వం
- కేవలం వివరణ కాదు, పూర్తిస్థాయి చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్న విపక్షాలు
- కేరళ పర్యటన కారణంగా సమావేశానికి హాజరుకాలేనని తెలిపిన రాహుల్ గాంధీ



**ఢిల్లీ :** పశ్చిమాసియాలో రోజురోజుకు ముదురుతున్న సంక్షోభం భారత్‌పై చూపే ఆర్థిక, భద్రతాపరమైన ప్రభావాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ కీలక అంశంపై రాజకీయ పార్టీలకు వాస్తవ పరిస్థితిని వివరించి, వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం - మిగతా 2 లో

# సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి లోకేశ్ సాదర స్వాగతం


- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల కుమార్తె వివాహ వేడుక
- హాజరైన ఏపీ మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- గుంటూరులో జరిగిన వేడుకలో పలువురు రాజకీయ ప్రముఖుల సందడి

**గుంటూరు :** టీడీపీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక గుంటూరులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకలో ఇరు రాష్ట్రాల నేతలు పక్కపక్కనే కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కుటుంబసభ్యులతో కలిసి వివాహానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి నారా లోకేశ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి నూతన వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి, వైవాహిక జీవితం - మిగతా 2 లో



# పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష

- పర్యాటకుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టేలను పెంచండి
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటకులు మరింత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి
- కారావాన్ పార్కులు, టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ



**అమరావతి :** రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని - మిగతా 2 లో

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

### జగిత్యాలలో భావోద్వేగ తుఫాన్, కార్యకర్తల సామూహిక రాజీనామాలు

**జగిత్యాల, మార్చ్ 25 (ప్రజా మంటలు) :** కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రాజీనామా చేయడం జగిత్యాల రాజకీయాల్లో పెద్ద ప్రకంపనలు సృష్టించింది. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకుంటూ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా భావోద్వేగభరితంగా మారింది."ఇంకా ఎంతకాలం ఈ అవమానాలు.. ఈ మానసిక క్షోభ" అంటూ జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.విధి లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు.ఇందిరా భవన్ నుంచి జంబి హనుమాన్ ఆలయం వరకు కార్యకర్తల నినాదాల మధ్య కాలినడకన వెళ్లి పూజలు నిర్వహించడం ఈ ఘటనకు ప్రత్యేకతను తీసుకువచ్చింది. అనంతరం బండారి గార్డెన్ వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

**పార్టీపై తీవ్ర విమర్శలూూ**

జీవన్ రెడ్డి తన ప్రసంగంలో కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

కార్యకర్తల హక్కులు కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.
"కార్యకర్తలు బలి అవుతుంటే అండగా నిలవడం లేదు"
"ముఖ్యమంత్రి కనీసం పరామర్శించలేదు"
"నా స్థాయికి తగిన గౌరవం దక్కలేదు"
అని ఆవేదన వ్యక్తం చేశారు.

**రేవంత్ రెడ్డి పై నేరుగా విమర్శలు**

సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
పార్టీలో తన ఎదుగుదలను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.
"చంద్రబాబు, కేసీఆర్‌లను ఎదిరించినట్లే రేవంత్ రెడ్డినీ ఎదుర్కొంటా" అని స్పష్టం చేశారు. కార్యకర్తల సామూహిక మద్దతు
జీవన్ రెడ్డి రాజీనామా అనంతరం వందలాది మంది కార్యకర్తలు, నాయకులు కూడా



పార్టీకి రాజీనామాలు చేశారు.
మండల అధ్యక్షులు
యూత్ కాంగ్రెస్ నాయకులు
మహిళా నాయకులు
సర్పంచులు, కౌన్సిలర్లు
తమ పదవులకు, సభ్యత్వాలకు రాజీనామా చేసి జీవన్ రెడ్డి వెంట నడుస్తామని ప్రకటించారు.

**జగిత్యాల నుండి కాంగ్రెస్‌కు షాక్**

"జగిత్యాల నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభం" అంటూ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
"పదవులు కాదు.. ఆత్మగౌరవమే ముఖ్యం" అని నినదించారు.
కొత్త పోరాటానికి పిలుపు
"మిగిలిన కాలం హక్కుల కోసం పోరాటం చేస్తాం" అంటూ జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు.
తనతో పాటు ముందుకు రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# సంపాదకీయం

## అడకత్తెరలో గల్ఫ్ దేశాలు!

ఇరాన్ మీద అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం గల్ఫ్ దేశాలకు ఒక బాధాకరమైన వాస్తవం. ఆ యుద్ధం గల్ఫ్ దేశాలు కోరుకున్నది కాదు. తమ ప్రాంతంలో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఈ దేశాల్లో కొన్ని అమెరికాను గట్టిగా హెచ్చరించాయి కూడా. కానీ అమెరికా ఎప్పటిలాగే తన గల్ఫ్ మిత్ర దేశాల మాటను పెడచెవిన పెట్టి, ఇజ్రాయెల్ అనుకూల ఎజెండాకే మొగ్గుచూపింది. దశాబ్దాలుగా, ఈ గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) దేశాలు అస్థిరస్థితిలోనే ఉన్నాయి. ఇరాక్ యుద్ధం ప్రభావం నుంచి అవి నేటికీ పూర్తిగా కోలుకోలేదు. సద్దాం హుస్సేన్‌ను అధికారం నుంచి తొలగిస్తే షియా ప్రజలు ఎక్కువగా ఉన్న ఇరాక్ క్రమంగా ఇరాన్ ప్రభావంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని సౌదీ అరేబియా నాయకులు నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్‌కు నచ్చచెప్పడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇప్పుడు ఈ గల్ఫ్ దేశాలు కొన్ని దశాబ్దాలుగా భయపడుతూ వచ్చిన పరిస్థితే నిజమయ్యింది. తొమ్మిదికోట్ల జనాభాతో అనేక జాతులతో కూడిన ఇరాన్ అస్థిరత అంచులకు చేరుతున్నది. సున్నీ ఆధిపత్యం ఉన్న అరబ్ దేశాలకూ షియా దేశమైన ఇరాన్‌కూ మధ్య ఈ ఉద్రిక్తతలకు మతపరమైన కారణాలు క్రీ.శ. 7వ శతాబ్దంలోనే మొదలయ్యాయి. మహమ్మద్ ప్రవక్త తర్వాత నాయకత్వం ఎవరికి దక్కాలి అనే ప్రశ్నతో ఈ విభేదాలు మొదలయ్యాయి. సరైన వారసుడు ఇమామ్ అలీ అని నమ్మిన అనుచరులను 'షియత్ అలీ' ('షియా') అని పిలుస్తారు. ఆయన కుమారుడు ఇమామ్ హుస్సేన్ కర్బలావద్ద క్రీ.శ.680లో యాజిద్ సైన్యం చేతిలో మృతి చెందడం ఈ విభేదాన్ని ఇంకా తీవ్రతరం చేసింది. దీంతో సున్నీలకు ('సున్నహ్' సంప్రదాయాన్ని అనుసరించేవారు), షియాలకు మధ్య దూరం మరింత పెరిగింది. 16వ శతాబ్దంలో సఫావిద్ సామ్రాజ్య పాలనలో ఇరాన్ అధికారికంగా 'ట్వెల్వర్ షియా' దేశంగా మారింది. షియా ప్రజలు ఇరాక్, అజర్‌బైజాన్, బహ్రెయిన్, సిరియా, లెబనాన్, యెమెన్, సౌదీ అరేబియా, ఇండియా, పాకిస్థాన్ దేశాలలో కూడా గణనీయంగా నివసిస్తున్నారు. షియాసున్నీల మధ్య వైరం 20వ శతాబ్దం దాకా కూడా కొనసాగింది. సౌదీ అరేబియా, ఇరాన్ దేశాలూ రెండూ ఇస్లాం సామ్రాజ్య ('ఉమ్మా') నాయకత్వం కోసం పోటీ పడ్డాయి. సౌదీ అరేబియా జీసీసీ దేశాలకు నాయకత్వం వహిస్తూనే, 57 దేశాలతో కూడిన 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్' (ఓఐసీ) దేశాల్లో కూడా కీలక హోదా సాధించింది. ముఖ్యంగా ఇరాన్ ప్రభావాన్ని నిలువరించే దిశగానే దాని ఈ ప్రయత్నాలన్నీ కొనసాగాయి. మరోవైపు, 1979 విప్లవం తర్వాత ఇరాన్ పలు ముస్లిం సమస్యలతో పాటు పాలస్తీనా సమస్యను కేంద్రంగా చేసుకుని వాదిస్తూ ఇస్లాం సామ్రాజ్య నాయకత్వ స్థానంలో తనను నిలుపుకునే ప్రయత్నం చేసింది. సున్నిషియా ఉద్రిక్తతలు ఆ ఇరుపక్షాల జనాభా సమాన స్థాయిలో ఉన్న ఇరాక్, లెబనాన్, సిరియా, యెమెన్ దేశాల్లో తరచుగా చెలరేగాయి. సౌదీ అరేబియా ఇరాన్‌లు ఎక్కడా ప్రత్యక్షంగా యుద్ధం చేసుకోకపోయినా, ఈ సున్నీషియా ఉద్రిక్తతలు చెలరేగిన దేశాల్లో భిన్న పక్షాలకు మద్దతు ఇస్తూ పరోక్ష యుద్ధాలు చేశాయి. జీసీసీ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలు ఉండటం కూడా ఇరాన్‌కు కోపం తెప్పిస్తున్న మరో ముఖ్యమైన అంశం. తమ దేశాన్ని కట్టడి చేసేందుకే అమెరికా ఈ వ్యూహాన్ని పాటిస్తున్నదని ఇరాన్ నమ్మకం. ప్రస్తుత యుద్ధానికి మూల కారణం పాలస్తీనా అంశంపై ఇరాన్‌ఇజ్రాయెల్‌ల మధ్య రాజుకున్న వైరమే. ముస్లిం సామ్రాజ్యం ('ఉమ్మా')పై ఆధిపత్యం కోసం తన ప్రయత్నాల్లో భాగంగా పాలస్తీనా అంశంపై ఇరాన్ మాట్లాడుతూ వచ్చింది. ఈ విషయంలో ఇరాన్ వాదనలనూ, దాని అణ్వాయుధ లక్ష్యాలనూ ఇజ్రాయెల్ తన ఉనికికే ముప్పుగా భావించింది. 2023 అక్టోబర్ 7 దాడుల తర్వాత హమాస్, హెజ్‌బొల్లాలను ఇజ్రాయెల్ అణచివేయడంతో ఆగకుండా, ఇరాన్ వైపు కదలింది. ఇరాన్ మీద పైచేయి సాధించడానికి ఇదే అదనుగా భావించింది. ఈ ఘర్షణ జీసీసీ దేశాల పాలిట ప్రమాదకరంగా మారింది. అమెరికాఇజ్రాయెల్ దేశాలకూ, ఇరాన్‌కూ మధ్య యుద్ధం జరుగుతుందనీ, దాని ప్రతికూల ప్రభావం తమ ప్రాంతంపై పడుతుందనీ ఈ దేశాలు ఎప్పటినుంచో భయపడుతున్నాయి. అమెరికాఇజ్రాయెల్‌తో దీటుగా ఇరాన్ ప్రతిదాడి చేయలేకపోవచ్చు. కానీ జీసీసీ దేశాల్లోని ప్రజాజీవనంపైన, వ్యాపారాలపైనా ఇరాన్ కలిగిస్తున్న నష్టం అపారం. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేస్తే అందుకు ప్రతిగా ఇరాన్ తమపై దాడి చేస్తుందని జీసీసీ దేశాలు ముందే అంచనా వేశాయి. ముఖ్యంగా తమ ప్రధాన ఆదాయ వనరులైన ఆయిల్, గ్యాస్ స్థావరాలపై దాడులు జరుగుతాయని అవి భయపడుతూనే ఉన్నాయి. హోర్ముజ్ జలసంధిని ముడి చమురు, గ్యాస్ ఎగుమతులకు పనికిరాకుండా చేయడమన్నది ఇరాన్ కీలక వ్యూహం. జీసీసీ దేశాలు ఆ విపత్తును ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్‌లు నిర్మించడానికి గతంలో ప్రయత్నించాయి, కానీ పూర్తిగా సఫలం కాలేదు. ఇరాన్ చిన్నచిన్న స్పీడ్‌బోట్లను గుంపులు గుంపులుగా ఉపయోగిస్తూ శత్రు నౌకలకు, చమురు ట్యాంకర్లకు నష్టం కలిగిస్తున్నది. యుద్ధంవల్ల నష్టాన్ని భరించే సామర్థ్యం ఇరాన్‌తో పోలిస్తే గల్ఫ్ దేశాలకు చాలా తక్కువ. ఆయిల్‌గ్యాస్ వ్యాపారాలు దెబ్బతిని, పర్యాటకుల రాక తగ్గి, షాపింగ్ మాల్సూ హోటళ్లూ ఖాళీ అయి, ఆ దేశాల్లో భద్రత లేదన్న చెడ్డపేరు పెరిగిపోతుంటే ఆ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. అలాగని ఇరాన్ పట్ల ప్రతీకారం తీర్చుకునే శక్తి కూడా వాటికి లేదు. ఈ విషయంలో అమెరికాని నమ్ముకుని ముందడుగు వేసే సాహసం అవి చేయలేవు. గతంలో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి దేశాలతో ఘర్షణల సమయంలో తన మిత్ర దేశాలను నడిమధ్యలో వదిలేసిన చరిత్ర అమెరికాకు ఉంది. రేపు అమెరికా తోడు ఉండొచ్చు ఉండకపోవచ్చు, కానీ ఇరాన్ మాత్రం తప్పించుకోలేని వాస్తవంలా పొరుగునే ఉంటుంది. ఇరాన్ చెప్పడానికైతే తన దాడులు జీసీసీ దేశాల్లో ఉన్న అమెరికన్ స్థావరాలపై మాత్రమే అని అంటోంది. కానీ వాస్తవం వేరు. దుబాయ్, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా దేశాల్లోని నివాస ప్రాంతాలు, విమానాశ్రయాలపై ఇరాన్ డ్రోన్లు దాడి చేస్తున్నాయి. అలాగే ఖతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లోని ఆయిల్‌గ్యాస్ స్థావరాలపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఎప్పుడో చెప్పలేం కానీ, ఏదో ఒక రోజు ఈ యుద్ధం ముగియక తప్పదు. అప్పుడు ఇజ్రాయెల్‌అమెరికా దేశాలు తమ గెలుపును చాటుకుంటూ వెళ్ళిపోవచ్చు. ఇరాన్ కూడా అంతే చేయచ్చు. కానీ అప్పటికే ఇరాన్‌కూ జీసీసీ దేశాలకూ మధ్య సంబంధాలు ఇకపై సరిదిద్దుకోలేనంతగా పాడైపోతాయి. అంతిమంగా, తమ ప్రమేయం ఏమీ లేకుండా ఈ యుద్ధంలో నష్టపోయేవి గల్ఫ్ దేశాలే!


## సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి లోకేశ్ సాదర స్వాగతం

**మొదటిపేజీ తరువాయి** – ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు టీడీపీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు 3 వేల లక్ష్యాలపై దాడులు

**మొదటిపేజీ తరువాయి** – యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## హైదరాబాద్‌లో వడగళ్ల వాన



**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. వనస్థలిపురం, హయత్ నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లిలో భారీ వర్షం కురుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో పలుచోట్ల ఈరోజు మధ్యాహ్నం వర్షం కురిసింది. ఆ తర్వాత కాస్త తెరిపిచ్చినప్పటికీ, సాయంత్రం మళ్లీ భారీ వర్షం ప్రారంభమైంది.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత

**మొదటిపేజీ తరువాయి** – ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయనుంది. శనివారం (28/3/2026) రోజున ఇందుకోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజున అసెంబ్లీలో ఈ విషయంపై చర్చించి తీర్మానం చేయనున్నారు. అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. తదుపరి కేంద్ర కేబినెట్ ముందుకు ఈ అంశం వెళ్లే అవకాశం ఉంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదం పొందిన తరువాత, ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలోని 5(2)కి సవరణ చేసేందుకు కేంద్రం కొద్దిరోజుల కిందటే చర్యలు ప్రారంభించింది. దీనికి ఇప్పటికే న్యాయశాఖ ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తర్వాత కేంద్ర మంత్రివర్గం ఆమోదించనుంది. ఆ తర్వాత పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ ఆమోదం తర్వాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజపత్రం విడుదల చేస్తారు.

**అమరావతి రైతులు ఉద్యమం :** విభజన తర్వాత ఏపీ రాజధానిగా అమరావతిని తెలుగుదేశం ప్రభుత్వం ఎంపిక చేసింది. 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. అమరావతిపై వైఎస్సార్సీపీ నేతలు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రైతులను ఇబ్బంది పెట్టారు. అసలు అమరావతి అభివృద్ధి దిశగా ఎలాంటి చర్యలు అప్పటి ప్రభుత్వం తీసుకోలేదు. దీంతో అమరావతి రైతులు ఉద్యమించారు. భిన్న రూపాల్లో పోరాటం చేసి అంతిమంగా గెలుపు సాధించారు.

**అమరావతికి మళ్లీ ఊపిరి :** 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రూ.వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆ దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి.

అసలు రాష్ట్ర విభజన చట్టంలో ఏముందంటే?

పార్ట్-2 కింద 5(1) : నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

పార్ట్-2 కింద 5(2) : సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.

రాజధానిగా అమరావతిని ఎలా నోటిఫై చేస్తారంటే?

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు.

పార్ట్ 2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు.

**చకచకా అమరావతి పనులు :** ఇప్పటికే రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ సహా ఎన్నో కంపెనీలు నెలకొననున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండోవిడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరించనున్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి మెజారిటీ రైతుల అభిప్రాయాలు సేకరించగా అత్యధికులు సానుకూలంగా స్పందించారు. తొలివిడత భూసమీకరణలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు రెండో విడతలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**సీఆర్డీఏ-2014 తీర్మానం సవరణ :** అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ తీర్మానానికి రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా సీఆర్డీఏ-2014 తీర్మానాన్ని సవరించాలని ఏపీకి సూచించింది. పీఎంవో సూచన మేరకు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయనుంది. అందులో భాగంగా ఈ నెల 28న శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

## పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**మొదటిపేజీ తరువాయి** – వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హేవ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వాస్తవాలు వివరించనున్న కేంద్రం

**మొదటిపేజీ తరువాయి** – నిర్వహించనుంది. పార్లమెంట్ లో సాయంత్రం 5 గంటలకు ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వం తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు మరో ఐదారుగురు మంత్రులు పాల్గొననున్నారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పశ్చిమాసియాలోని తాజా పరిణామాలు, ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావాన్ని రాజకీయ పార్టీల నేతలకు సమగ్రంగా వివరించను న్నారు. పశ్చిమాసియాలో నెలకొన్నది ఒక అపూర్వమైన సంక్షోభమని, దీని ప్రభావం దీర్ఘకాలం ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల్లో పేర్కొన్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. గత నాలుగు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి వంటి కీలకమైన సముద్ర వాణిజ్య మార్గాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇది ప్రపంచ ఇంధన మార్కెట్లలో అస్థిరతకు దారితీయడమే కాకుండా అంతర్జాతీయ సరఫరా గొలుసులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి కారణమవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రాజకీయ పార్టీలతో



సంప్రదింపులు ముమ్మరం చేసింది.

**పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చ జరపాలని పట్టుబడుతున్న విపక్షాలు**

అయితే, ఈ అంశంపై కేవలం వివరణ ఇవ్వడమే కాకుండా పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ సహా విపక్షాలు పట్టుబడుతున్నాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా సభలో సమగ్ర చర్చ అవసరమని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. మరోవైపు ప్రభుత్వ విదేశాంగ విధానం వ్యక్తిగత ప్రయోజనాలతో రాజీపడిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే, కేరళలో ముందుగా ఖరారైన కార్యక్రమం కారణంగా తాను ఈ సమావేశానికి హాజరుకాలేక పోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ అఖిలపక్ష భేటీకి ఒకరోజు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ కామత్‌లతో ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష జరిగింది. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశ భద్రతకు సంబంధించిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రయోజనాల విషయంలో విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

## తెలంగాణలో ఇంధన కొరత లేదు



**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్రంలో 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వదంతుల కారణంగా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కొనుగోలు చేయడంతో బంకుల్లో రద్దీ నెలకొందని అన్నారు. క్యాన్లు, కంటైనర్లలో ఇంధనాన్ని తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో హాస్టళ్లు, ఆసుపత్రులకు గ్యాస్ కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా పని చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఏ బంకును కూడా మూసివేయడానికి అనుమతించలేదని అన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రంతో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.


## రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు



**మొదటిపేజీ తరువాయి** – భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి

**మొదటిపేజీ తరువాయి** – కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.



ప్రజా మంటలు

గురువారం 26 - 03 - 2026

# జోష్ నింపిన అల్ఫోర్స్ హై స్కూల్ "విస్టా" వార్షికోత్సవ వేడుకలు

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువల పట్ల చక్కటి అవగాహన కలిగి ఉండాలని తద్వారా వారికి సమాజంలో ఉత్తమంగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ,దండి లక్ష్మి కొమరయ్య , చైర్ పర్సన్ పురపాలక సంఘం, హుస్నాబాద్, శ్రీమతి చిత్తారి పద్మ , వైస్ చైర్ పర్సన్ పురపాలక సంఘం హుస్నాబాద్, కంది తిరుపతి రెడ్డి చైర్మన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలి శెట్టి శివయ్య మరియు ఇతర అతిథులతో కలిసి స్థానిక హనుమాన్ నగర్లో గల అల్ఫోర్స్ హై స్కూల్ పాఠశాల మైదానంలో "విస్టా" పేరుతో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి వేడుకలను అట్టహాసంగా విద్యార్థుల కేరింతల మధ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు పలు నైతిక విలువలు చాలా అవసరమని ఈ నైతిక విలువలు ద్వారా విద్యార్థులకు వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయని మరియు ఉత్తమ స్థానాలలో స్థిరపడేందుకు దోహదపడుతుందని వారు చెప్పారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యారంగానికి చాలా నిధులు కేటాయించబడుతున్నాయని మరియు ప్రతి ఒక్కరికి విద్య అందాలనే ఉద్దేశంతో మారుమూల ప్రాంతాలలో సైతం ప్రభుత్వ పాఠశాలలను నెలకొల్పుతూ అందరికీ విద్య అందేలా కృషి చేస్తున్నారని వారు చెప్పారు. నేడు పలు ప్రాంతాలలో సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రాథమిక విద్యను విద్యార్థుల్లో నైతిక మరియు బాధ్యత గా మెదిలే ప్రక్రియలను నేర్పుతున్నారని వారు చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి కొమరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఏకాగ్రత చాలా అవసరమని మరియు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కృషిచేసి సమాజంలో పై చేయి సాధించాలని వారు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శ్రీమతి పద్మా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా విషయాల పట్ల పట్టు సాధించాలని మరియు కృషిచేసి అత్యుత్తమంగా ఉండాలని సూచించారు మొబైల్ ఫోన్లకు దూరంగా




ఉండాలని మరియు సమయాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు అనుకున్న లక్ష్యాలను ఛేదించాలని వారు చెప్పారువేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు కార్యక్రమాలు మరియు ఆలపించిన జానపద గేయాలు అలరించేసాయి మరియు ఆనందపరిచాయి.వార్షిక ప్రణాళికలో భాగంగా కుటుంబ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుపతి , రాజు బొలిశెట్టి ,బొల్లి శ్రీనివాస్ , వైద్యం కిరణ్ ప్రసాద్ గారు, రవీందర్ గారు, వరప్రసాద్ , కొండ రజిత గారు, ఎస్.మంజుల , వర సుప్రజ , సర్పంచులు - కృష్ణ నాయక్ గారు, పండుగ శ్రీకాంత్ , రాజ్ కుమార్ , కే.సృజన్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు & విద్యార్థులు పాల్గొన్నారు.

## ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో సీతారాముల కళ్యాణం

### భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

### 19 విగ్రహాల ప్రతిష్టాపనతో ఆలయానికి కొత్త కళ




**భీమదేవరపల్లి, మార్చి 25 (ప్రజా మంటలు):**ప్రసిద్ధ కాకతీయుల కాలం నాటి ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీలలో 19 నూతన విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్టాపనతో ఆలయానికి కొత్త కళ వచ్చిందని గ్రామ ప్రజలు తెలిపారు. నూతన విగ్రహాల ప్రతిష్టాపన అనంతరం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీఎస్ భక్త బృందం వెల్లడించింది. ఆలయ ప్రాంగణంలో గ్రామ పురోభివృద్ధి దృష్ట్యా భక్త బృందం, గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతారాముల కళ్యాణం అనంతరం దాతల సహకారంతో మహా అన్నప్రసాద వితరణ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీఎస్ భక్త బృందం కోరింది.

## డా. చుక్కా సత్తయ్య విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరణ





**జనగామ, మార్చి 25 (ప్రజామంటలు):** జనగామ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర సంగీత నాటక అకాడమీ జాతీయ పురస్కార గ్రహీత, ఒగ్గుకళా సామ్రాట్ డా.చుక్క సత్తయ్య 91వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 29 ఆదివారం విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరించారు. బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజా కళాకారులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని జిల్లా కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ కురుమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడకంచి బాలమణి శ్రీనివాస్ కురుమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు కురుమ,26వ వార్డు కౌన్సిలర్ సేవేల్లి మధు కురుమ, 20వ వార్డు కౌన్సిలర్ దామెర రమ రాజు , జనగామ బీసీ సంఘం అధ్యక్షులు దూడల సిద్ధయ్య గారు, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ ధర్మపురి శ్రీనివాస్, జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు , జనగామ జిల్లా కురుమ సంఘం మహిళా అధ్యక్షురాలు దామెర మల్లికాంబ ,జి.వై.గిరి ఫౌండేషన్ చైర్మన్ జి.కృష్ణ, కురుమ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ సంఘం అధ్యక్షులు కడకంచి మధుసూదన్ కురుమ, రాష్ట్ర కురుమ సంఘం యువజన ఉపాధ్యక్షులు ఆలేటి రాజు కురుమ, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ గౌరిగే రవి కురుమ, బచ్చన్నపేట మండలం కురుమ సంఘం అధ్యక్షులు జూకంటి కిష్టయ్య , రాష్ట్ర ఒగ్గుబీర్ల సంఘం గౌరవ సలహాదారుడు చౌదరపల్లి రోశయ్య జనగామ ఒగ్గు బీర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరిగే రామచంద్రం కురుమ, మంగ రామకృష్ణ, దయ్యాల శ్రీనివాస్ ఎంద్ర వైకుంఠం కేమిడి ఉపేందర్ పోరెల్లి సిద్ధులు జాయ సత్తయ్య నిమ్మల కుమార్ స్వామి కొత్తపెల్లి అవినాష్ సలేంద్ర శ్రీనివాస్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ టీఎన్జీవోల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

### అధ్యక్షుడిగా దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా సంగేం లక్ష్మణరావు



**కరీంనగర్, మార్చ్ 25 (ప్రజా మంటలు):**కరీంనగర్ జిల్లాలో టీఎన్జీవోల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా సంఘం కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారిగా కేంద్ర సంఘం మాజీ ఉపాధ్యక్షులు సుద్దాల రాజయ్య గౌడ్ వ్యవహరించగా, రాష్ట్ర కార్యదర్శి రాగి శ్రీనివాస్ జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయిందని ఆయన తెలిపారు.ఈ ఎన్నికల్లోజిల్లా అధ్యక్షుడిగా దారం శ్రీనివాస్ రెడ్డికార్యదర్శిగా సంగేం లక్ష్మణరావుఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగేఅసోసియేట్ అధ్యక్షుడిగా ఒంటెల రవీందర్ రెడ్డికోశాధికారిగా ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డిఉపాధ్యక్షులుగా గంగారపు రమేష్ గౌడ్, ఇరుమల్ల శారద, గోవిందపతి శ్రీనివాస్, సబితా రెడ్డి, ముద్దసాని సునీత, పి.శంకర్, వి.ప్రసాద్, ఎన్.అనిల్ కుమార్, పెట్టేం శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.ఇక జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, స్టాండింగ్ కమిటీ ప్రతినిధులు సహా పలు హోదాలకు అనేక మంది నాయకులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలు ఏకగ్రీవంగా, శాంతియుతంగా పూర్తవడం ఆనందదాయకమని తెలిపారు. సంఘ ప్రతిష్టను కాపాడుతూ, సభ్యుల సంక్షేమం కోసం కొత్త కార్యవర్గం కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల అధికారులకు, రాష్ట్ర నాయకత్వానికి, సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల కేంద్ర సంఘం నాయకులు, జిల్లా, పట్టణ, గ్రామ స్థాయి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షనర్లకు నష్టం చేసే వ్యాలిడేషన్ చట్టం ఉపసంహరించాలి



**భీమదేవరపల్లి, మార్చి 25 (ప్రజా మంటలు) :**పెన్షనర్లకు నష్టం కలిగించే వ్యాలిడేషన్ చట్టం2025ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. పెన్షనర్లను వర్గీకరించే అధికారం కేంద్రానికి కల్పిస్తూ రూపొందించిన ఈ చట్టం మార్చి 25, 2025 నుంచి అమల్లోకి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఫైనాన్స్ బిల్లులో భాగంగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి, అదే రోజున లోక్‌సభ ఆమోదించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా పెన్షనర్లను వర్గీకరించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో వివిధ పే కమిషన్ల అమలు కాలానికి ముందు రిటైర్ అయిన పెన్షనర్లు ప్రయోజనాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో పెన్షన్ పెంపు లేకపోవడం వల్ల వృద్ధ పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఫెడరేషన్ హెచ్చరించింది. న్యాయం, సమానత్వం దృష్ట్యా వ్యాలిడేషన్ చట్టం2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భీమదేవరపల్లి యూనిట్ అధ్యక్షులు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగయ్య, కోశాధికారి రాజమౌళి, ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, జాయింట్ కార్యదర్శి సారయ్య, చంద్రారెడ్డి, గోరెమియా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలి

### ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల మార్చి 25 ( ప్రజా మంటలు)** :జాతీయస్థాయి క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.జమ్మూ లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీల్లో తెలంగాణ పోలీస్ తరపున పాల్గొని కాంస్య పతకం సాధించిన రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జమ్మూ అండ్ కాశ్మీర్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ తరపున జగిత్యాల జిల్లా నుండి పాల్గొన్న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ విశేష ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, రమేష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలలో తెలంగాణ పోలీస్ తరుపున పాల్గొని విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు .

## హుస్నాబాద్ అభివృద్ధిపై పాలకవర్గం ఫోకస్


### 43 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం




**హుస్నాబాద్ ,మార్చి 25,( ప్రజా మంటలు):**హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం చైర్ పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై చర్చించి, పాలకవర్గం ఏకగ్రీవంగా మొత్తం 43 అంశాలకు ఆమోదం తెలిపింది. సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు పట్టణంలోని 20 వార్డుల్లో సుమారు 1000 కోతులను పట్టుకోవడానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 6 లక్షల వ్యయాన్ని అంచనా వేశారు.ఘన వ్యర్థాల నిర్వహణ అమలు చేసి యూజర్ చార్జీలు వసూలు చేయడం, మల్లెచెట్టు చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసి హైదరాబాద్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం, స్ట్రీట్ లైట్ల నిర్వహణకు రూ. 10 లక్షలు, ఐ=జజ సెంటర్ వద్ద పొడి చెత్త వేరు చేయుటకు కొత్త షెడ్ నిర్మాణానికి రూ. 50 లక్షలు, పట్టణంలోని రోడ్లు, డ్రైన్లు, కల్వర్ట నిర్వహణకు రూ. 10 లక్షలు, ఎండాకాలం దృష్ట్యా నీటి సరఫరా మోటర్లు మరియు స్టార్టర్ల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయించడం జరిగింది. ప్రధాన కూడళ్లలో మార్గదర్శక సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం వంటి అంశాలు ఉన్నాయి.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్, కాశబోయిన సరిత, గడిపె సతీష్ కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, గోపగోని శోభన్ బాబు, కమిషనర్ టి. మల్లికార్జున్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## రచయిత నల్లాల లక్ష్మి రాజం అకాల మృతి






**జగిత్యాల, మార్చ్ 25 (ప్రజా మంటలు):**కరీంనగర్ జిల్లా నుండి ఎదిగిన ప్రముఖ రచయిత, దళిత సాహితీవేత్త నల్లాల లక్ష్మి రాజం అకాల మరణం పట్ల సాహితీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమైంది. ప్రముఖ రచయిత బి.ఎస్. రాములు తన సంతాపాన్ని తెలియజేస్తూ, ఇది సాహిత్య రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు.కథా రచయితగా, నాటకకర్తగా, పాటల కవిగా నల్లాల లక్ష్మి రాజం విశిష్ట స్థానం సంపాదించారు. ఆయన రచించిన "తిరుగు ప్రయాణం" కథల సంపుటి విశేష ఆదరణ పొందడంతో పాటు విశాల సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుంది.అలాగే "జీబీ రాజ్ జిందాబాద్" నాటక ప్రదర్శన ద్వారా మద్యపాన వ్యతిరేక చైతన్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేశారు. కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై ఆయన నిరంతరం పోరాడారు."నీ బాకీ తప్పక తీరుస్తానుడ" అంటూ సామాజిక వ్యంగ్యంతో కూడిన ఆయన పాట ప్రజల్లో విశేష ప్రాచుర్యం పొందింది.జగిత్యాల సమీపంలోని తక్కల్లపల్లి గ్రామంలో జన్మించిన లక్ష్మి రాజం విప్లవ భావజాలానికి సానుభూతి కలిగి జీవించారు. జీవన పరిస్థితుల కారణంగా పోలీస్ శాఖలో చేరి, కరీంనగర్ జిల్లాలో పోలీస్ విభాగం తరఫున అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రజలు, అధికారుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు.అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మార్చ్ 25, 2026న హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.1992 నుంచి తనకు పరిచయమై, కుటుంబ సభ్యుడిలా మారిన లక్ష్మి రాజం మరణం పట్ల బి.ఎస్. రాములు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.జగిత్యాల సాహితీ మిత్రులు కూడా ఆయన అకాల మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## పార్కింగ్ చేసిన వాహనాలను దగ్ధం చేసిన దుండగులు



**ఎల్కతుర్తి మార్చ్ 25 ప్రజా మంటలు :**ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఇంద్రానగర్ గ్రామ సమీపాన ముల్కనూర్ డాక్టర్ సుధాకర్ కు చెందిన ఫామ్ హౌస్ లో పార్కింగ్ చేసిన రెండు టీవీఎస్ ఎక్సెల్ వాహనాలను మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిగా దగ్ధం చేశారు. ఎందుకు చేశారు..? ఎవరు చేశారు..? అనేది తెలియాల్సి ఉంది. డాక్టర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## జగిత్యాలలో రాజీనామాల దుమారం

### జీవన్ రెడ్డి కోసం కాంగ్రెస్‌కు షాక్



**జగిత్యాల, మార్చ్ 25 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో రాజీనామాల పర్వం మొదలైంది. వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి తమ పదవితో పాటు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గోపిక తెలిపారు. జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న వేళ, ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.ఇదే దారిలో మరికొంత మంది స్థానిక నాయకులు కూడా పార్టీని వీడుతున్నారు. పెగడపల్లి మండలం బతికపల్లి సర్పంచ్ ముంజ మహేశ్వరి-మధుకర్, మాజీ సర్పంచులు తాటిపర్తి శోభారాణి, తాటిపర్తి ప్రభాకర్ రెడ్డి, అలాగే నంచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోలి మహేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు సమాచారం.జిల్లాలో జీవన్ రెడ్డి నిర్ణయాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండగా, మరిన్ని రాజీనామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఆర్థోపెడిక్ రంగంలో కొత్త దిశ

### పానోస్కోపీ టెక్నాలజీకి శ్రీకారం



**సికింద్రాబాద్, మార్చి 25 ( ప్రజామంటలు):**ఆర్థోపెడిక్ వైద్యరంగంలో మరో కీలక ముందడుగు పడింది. అత్యాధునిక 'పానోస్కోపీ' టెక్నాలజీని దేశంలో తొలిసారిగా కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ప్రవేశపెట్టారు. ఈ టెక్నాలజీ ఆవిష్కరణతో సంధి సంబంధిత వ్యాధుల నిర్ధారణ, శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయి.బేగంపేటలోని ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ టెక్నాలజీని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి మాట్లాడుతూ, సంప్రదాయ ఆర్థ్రోస్కోపీ విధానంతో పోలిస్తే పానోస్కోపీ మరింత విస్తృత దృశ్యాన్ని అందిస్తుందని తెలిపారు. లోతైన, క్లిష్టమైన సంధి గాయాలను కూడా స్పష్టంగా గుర్తించే సామర్థ్యం దీనికి ఉందన్నారు.షోల్డర్, స్పోర్ట్స్ సర్జరీ విభాగం డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ టెక్నాలజీ ద్వారా ఇప్పటివరకు గుర్తించని గాయాలను సులభంగా గుర్తించి ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చని చెప్పారు. భుజం డిస్లోకేషన్, రోటేటర్ కఫ్ చీలికలు, టెన్నిస్ ఎల్బో, మోకాలి లిగమెంట్ గాయాలు వంటి సమస్యల చికిత్సలో ఇది ఎంతో ఉపయోగకరమని వివరించారు.పానోస్కోపీ టెక్నాలజీ ద్వారా సంధుల్లో ఉన్న 'బ్లైండ్ స్పాట్స్' తొలగిపోవడం వల్ల చిన్న గాయాలను కూడా గుర్తించి సమర్థవంతంగా చికిత్స అందించవచ్చు. దీని వల్ల రోగులు త్వరగా కోలుకోవడంతో పాటు దీర్ఘకాలిక ఫలితాలు మెరుగుపడనున్నాయి.ప్రపంచ స్థాయి వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఈ టెక్నాలజీని భారతదేశంలో ప్రవేశపెట్టడం గర్వకారణమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## జాతీయ సామాజిక సేవా అవార్డు అందుకున్న

### డా.జేరిపోతుల పరశురామ్




**జనగామ, మార్చి 25 (ప్రజామంటలు):** ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్ లో ఉగాదివేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్రం జనగామ పట్టణానికి చెందిన కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ కేంద్ర పౌర సరఫరాలు, అటవీ, పర్యావరణ శాఖ మాజీ మంత్రి అశ్విని కుమార్ చౌబే మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి అదిలీల ఫౌండషన్ చైర్మన్ ఆదినారాయణల చేతుల మీద జాతీయ సామాజిక అవార్డు అందుకున్నారు డా జేరిపోతుల పరశురామ్ విద్యార్థి, యువజన, వికలాగుల, దళిత సంఘాల లో ఎన్నో పదవులు పోంది వారి హక్కుల కోసం ఏన్నో ఉద్యమాలు చేశారు. కళా వేదిక అభివృద్ధి సేవా సంస్థ స్థాపించి బాలల హక్కుల కోసం పాఠశాల ను ఏర్పాటు ఏర్పాటు చేసి విద్యను అందించారు. బాల కార్మికుల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలచే ఎన్నో అవార్డులు తీసుకున్నారు.2016 లో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి సంఘాన్ని స్థాపించి ఆర్బిఐ స్ఫూర్తి ప్రదాత డా బి ఆర్ అంబేద్కర్ కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని పల్లె నుండి ఢిల్లీ వరకు ఎన్నో యాత్రలు చేసి ఢిల్లీ లో 26 సార్లు ధర్నా నిర్వహించి 18 మంది పార్లమెంట్ సభ్యులతో పార్లమెంట్ లో మాట్లాడించిన గొప్ప ఉద్యమా కారుడుఅయన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఆదిలీల ఫౌండేషన్ జాతీయ సామాజిక సేవా అవార్డును అందజేసింది.

## జర్నలిస్ట్ విజయకుమార్ మృతి పలువురి సంతాపం



**జనగామ మార్చి 25 (ప్రజామంటలు);** గత కొంత కాలంగా అస్వస్థతో ఉన్న సీనియర్ జర్నలిస్ట్ రచ్చ విజయకుమార్ (74) బుధవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న హైదరాబాద్ నాగోల్ లో అంత్యక్రియలు గురువారం జరుగుతాయని ఆయన సోదరుడు రచ్చ రమేశ్ తెలిపారు. దివంగత విజయ కుమార్ శ్రీమతి భారతి దంపతులకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న కుమారుడు విష్ణువర్ధన్ ఇరువురు కుమార్తెలు ఉన్నారు. జనగామ పట్టణానికి చెందిన విజయకుమార్ ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్ర జ్యోతి దిన పత్రికల లో జనగామ విలేకరిగా పనిచేశారు. తీర్పు వార పత్రికను ప్రారంభించి కొంత కాలం మాత్రం నడిపించారు. జనగామ పట్టణానికి చెందిన తొలి తరం పాత్రికేయులలో ఒకరైన విజయకుమార్ మరణవార్త విని సీనియర్ జర్నలిస్ట్, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు, భోపాల్ లో ఉన్న బులుసు ఈశ్వర్ కుమార్ లు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయకుమార్ తో కలిసి పని చేసిన మలితరం పాత్రికేయులు పార్నంది వెంకటస్వామి, ఎం. శివకుమారు, జి. క్రిష్ణ, ఐ జె యు నాయకుడు దాసరి కృష్ణారెడ్డి, జనగామ ప్రాంతానికి చెందిన పలువురు పాత్రికేయులు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. విజయకుమార్ మృతి పట్ల పుర ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, బక్క నాగరాజు, ధర్మపురి శ్రీనివాస్, డా. డి. లవకుమార్ రెడ్డి. డా. రాజమౌళి, డా. లక్ష్మీనారాయణ నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు.

ప్రజా మంటలు

గురువారం 26 - 03 - 2026

# పేమెంట్‌లో మార్పు కాస్త నో స్టాక్ బోర్డులు పెట్టే వరకు వెళ్లింది!

**పెట్రోల్, డీజిల్ దొరకదన్న భయంతో 3 రెట్ల వరకు పెరిగిన కొనుగోళ్లు**

**అవసరం మేరకు ఇంధన కొనుగోళ్లు చేసుకోవాలని పిలుపునిచ్చిన టీపీడీఎస్**

**తెలంగాణలో ఇంధన కొరత లేదని వెల్లడి**




పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ఆయిల్ సంస్థలు కొత్త నిబంధనలను అమలు చేస్తున్నాయి. దీంతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇంధన లభ్యతపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. పెట్రోల్ స్టాక్ అయిపోయి నగరంలోని అనేక చోట్ల పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. దీంతో జనం భారీ సంఖ్యలో బంకుల్లో బారులు తీరారు. గత రెండు రోజులుగా అనేక చోట్ల ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రాష్ట్రంలో ఇంధన కొరత లేదని తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ ప్రకటించింది. ఇంధన కొరతపై తప్పుడు ప్రచారాలను నమ్మి అనవసరంగా ఆందోళన చెందవద్దని ప్రకటనలో పేర్కొంది.

**మూడు రెట్లు పెరిగిన కొనుగోళ్లు :** పెట్రోల్, డీజిల్ దొరకదన్న భయంతో కొనుగోళ్లు దాదాపు 2.5 నుంచి 3 రెట్ల వరకు పెరిగాయని దీంతో తాత్కాలికంగా పలు రిటైల్ ఔట్‌లెట్లలో ఇంధన నిల్వలు తగ్గిపోవటానికి కారణమని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపింది. సప్లై చైన్ సాధారణంగానే పనిచేస్తోందని వివరించింది. ప్రజలు ఆందోళన చెంది అనవసరంగా ఇంధన కొనుగోళ్లు చేయవద్దని తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ కోరింది. కంటైనర్లలో, క్యాన్‌లలో పెట్రోల్, డీజిల్‌ను నిల్వ చేయవద్దని పేర్కొంది. అవసరం మేరకు ఇంధన కొనుగోళ్లు చేసుకోవాలని కోరింది. అందరం కలిసికట్టుగా ఉండి ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకుందామని పిలుపునిచ్చింది.

**కొత్త నిబంధన కారణంగా :** గతంలో ఇంధన సంస్థలు నగదు తీసుకోకుండానే ముందుగా పెట్రోల్, డీజిల్‌ను సమరఫరా చేసేవి. అయితే ఈ నగదులు ఒకటి లేదా రెండు రోజుల్లో బంకుల యజమానులు పెట్రోల్ సంస్థలకు చెల్లించేవారు. ఈ విధానంతో పెట్రోల్ బంకు యజమానులకు సైతం సౌకర్యంగా ఉండేది. అయితే ఒక్క సారిగా నిబంధనలను మార్చారు. దీంతో గత మూడు నాలుగు రోజులుగా ఇంధనానికి సరిపడ సొమ్మును ముందుగానే చెల్లించమని బంకు యజమానులకు ఇంధన సంస్థలు తెలిపాయి. అలా చెల్లిస్తేనే సరఫరా చేస్తామని స్పష్టం చేశాయి.నగదు చెల్లించలేని పలు బంకులకు ఇంధన సరఫరా నిలిచిపోయింది. పాత బకాయిలు చెల్లించడంతో పాటు కొత్త స్టాక్‌కు డబ్బులు ముందే చెల్లించలేకపోవడంతో నగర వ్యాప్తంగా అనేక చోట్ల బంకులను మూసివేశారు. దీంతో నగరంలోని మిగతా పెట్రోల్ బంకులపై ఒక్కసారిగా ఒత్తిడి పెరిగింది. తెచ్చిన స్టాక్ మొత్తం ఒక్క రోజులోనే పూర్తయింది. మరోసారి స్టాక్ వచ్చేవరకు ఈ బంకులు సైతం మూత పడుతున్నాయి.

**పెరిగిన ట్రాఫిక్ సమస్యలు :** నగరంలో మంగళవారం ఉదయం నుంచి బంకులకు వాహన తాకిడి ప్రారంభమైంది. దీంతో నగరంలో కూకట్‌పల్లి, సికింద్రాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్, మాదాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పుకార్లను నమ్మవద్దుంటూ వాహనదారులను బంకుల నుంచి వెనక్కి పంపించి, ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దే ప్రయత్నం చేయాల్సి వచ్చింది.

**ఆందోళన వద్దు కొరత లేదు :** హైదరాబాద్ వ్యాప్తంగా ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (ఎల్‌పీజీ) కొరత లేదని పౌర సరఫరాల శాఖ వెల్లడించింది. డిపోల వద్ద తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. ప్రజలు భయపడి అనవసరంగా తమ వాహనాల ట్యాంకులు నింపుకోవడానికి ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు చేరుకోవడం వల్లే కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల వల్ల స్థానిక డీలర్లకు చిన్నపాటి తాత్కాలిక సమస్య ఏర్పడిందని సరఫరాలో ఎలాంటి లోపం లేదని ఆ శాఖ చెబుతోంది.

# టెర్రర్ లింక్ కేసు మరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సయీదా బేగంను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న కౌంటర్ ఇంటెలిజెన్స్**

**పోలీసుల అదుపులో హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయీదా బేగం**

**తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో కీలకంగా వ్యవహరించిన సయీదా బేగం**



ఉగ్ర లింకుల కేసులో మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడలోని సయీదా బేగం నివాసంలో ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం సయీదా బేగంకు పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చి, అదుపులోకి తీసుకున్నారు. సయీదా బేగంను విజయవాడకు తరలించారు.టెర్రర్ లింక్ కేసులో హైదరాబాద్ మహిళను విజయవాడ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ పోలీసులకు సమాచారమిచ్చి నిందితురాలిని విజయవాడకు తీసుకువచ్చారు. రహస్య ప్రాంతంలో ఆమెను ప్రశ్నిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక సయిదాను విజయవాడ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.మహారాష్ట్రంలోని షోలాపూర్‌కు చెందిన సయిదా బేగం చాలా ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉంటోంది. గతంలో అనుమానంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులు ఓసారి ఆమెను విచారణ చేశారు. అయినా ఏమాత్రం భయం లేకుండా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ యువకుల్ని టెర్రరిజం వైపు మళ్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**ఆమె వెనుక ఓ విదేశీ హ్యాండ్లర్ :** విజయవాడలోని వించిపేటలో రెండు రోజుల క్రితం అరెస్టయిన ముగ్గురు యువకులకు ఉగ్రవాద భావజాలం ఎక్కించడంలో సయిదా కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సుమారు ఏడాదిగా వారితో ఆన్‌లైన్‌లో కమ్యూనికేట్ అవుతున్నట్లు తేల్చారు. సయిదా బేగం వెనుక ఓ విదేశీ హ్యాండ్లర్ ఉన్నట్లు పోలీసు విచారణలో తేలింది. వీళ్లతో పాటు మొత్తం 12 మంది సభ్యుల గ్యాంగ్ ఆన్‌లైన్‌లో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, 5 ప్రాంతాలకు పంపించారు.ఇప్పటికే ఈ కేసులో విజయవాడ ఉగ్ర లింకు కేసులో నిందితులు మహ్మద్ రెహ్మతుల్లా, మీర్జా సోహెల్, మహ్మద్ డానిష్‌లను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఏప్రిల్ 6 వరకూ జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో వారిని విజయవాడ కేంద్ర కారాగారానికి తరలించారు. విచారణ సందర్భంగా న్యాయవాదిని నియమించుకున్నారా? అని నిందితులను న్యాయమూర్తి ప్రశ్నించగా, తాము నియమించుకోలేమని తెలిపారు. ఈ విషయాన్ని రాత పూర్వకంగా కోర్టుకు ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇవ్వడంతో వారిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురినీ విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ సహా పలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు.ఉగ్రవాద రిక్రూట్‌మెంట్, జిహాదీ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులను వీరికి పాకిస్థాన్ హ్యాండర్లు సమకూరుస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం ఉంది. ఏపీలోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులతో వీరు గ్రూప్‌లను ఏర్పాటు చేసి, అందులో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, వారు ఉగ్రవాదుల కోసం సన్నద్ధమయ్యేలా పురిగొల్పుతున్నట్లు విచారణలో తేలింది.

**యువతను తప్పుదారి పట్టిస్తూ :** ఉగ్రవాద నెట్‌వర్క్‌లోని మిగతా వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు సామాజిక మాధ్యమాల్లో నిర్వహించే ఖాతాలు, వెబ్‌సైట్లు వంటి వాటిని యువత అనుసరించొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇవి విద్వేషపూరిత భావజాలాన్ని ప్రేరేపించి దేశ స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, సామాజిక మాధ్యమాల ద్వారా యువతను తప్పుదారి పట్టిస్తున్న దేశ ద్రోహ శక్తుల నుంచి దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా మూసీ

**ఓంకారేశ్వర మందిర నిర్మాణానికి ప్రణాళికలు**

**మచిలేశ్వర ఆలయం వద్ద నూతనంగా ఓంకారేశ్వర మందిరం నిర్మాణం**

**నది మధ్యలో 100 అడుగుల శివుని విగ్రహం ఏర్పాటు**

**ఈనెల 28న శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి**



మూసీ నది పరివాహక ప్రాంతాన్ని మత సామరస్యానికి ప్రతీకగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ శివాలయ నిర్మాణ పనుల ప్రాజెక్టు శ్రీకారం చుట్టనుంది. ఈ నిర్మాణంలో భాగంగా గండిపేట మండలం మంచిరేవుల గ్రామ పరిధిలోని 800 ఏళ్ల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయాన్ని, 1400 సంవత్సరాల నాటి మచిలేశ్వర ఆలయం వద్ద నూతంగా ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించింది.ఆలయ నిర్మాణశైలి ఖరారు చేసేందుకు కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ ఆలయ నిర్మాణ పనులకు వీరభద్రస్వామి దేవాలయ ప్రాంతంలో ఈ నెల 28న ఉదయం 8.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శృంగేరిపీఠం ముఖ్య ప్రతినిధులు పాల్గొంటారు. వివరాల్లోకి వెళితే,

**అభివృద్ధికి తొలి మెట్టు :** హైదరాబాద్ నగరానికి పశ్చిమాన ఉన్న జంట జలాశయాల నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు హైదరాబాద్ నగరంలో సుమారు 55 కిలోమీటర్ల పొడవున మూసీ నది ప్రవహిస్తోంది. ఈ పరిధిలోనే దేశంలోని నాలుగు ప్రధాన మతాలకు సంబంధించిన ప్రార్థనా మందిరాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి సంబంధించిన నిర్మాణాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకుంది. మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనితో పాటు నాగోల్‌లో చర్చి నిర్మాణం చేపట్టాలని, పురానాపూల్ వద్ద భారీ



మసీదు నిర్మించాలని, గౌలిగూడ వద్ద గురుద్వారా కట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు త్వరలో చేపట్టనున్న మూసీ తొలిదశ అభివృద్ధి పనులను చేపట్టనున్న విషయం తెలిసిందే. వీటిని ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనతో ప్రారంభించబోతున్నారు.

**చరిత్రాత్మక మందిరాలు నిర్మాణం :** గండిపేట జలాశయానికి దిగువన గుట్టపై ఉన్న వీరభద్రస్వామి దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించారు. దీనికి సమీపంలో ఉన్న మచిలేశ్వర శివలింగాన్ని చాళుక్యులు ప్రతిష్ఠించారని ఆలయ నిర్వహకులు పరమేశ్వర్ వెల్లడించారు. ఈ దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటు దీనికి సమీపంలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

**రెండో అతిపెద్ద గర్భాలయం :** ఈ నూతన ఆలయ నిర్ణాణంలో ఎత్తయిన గాలి గోపురాన్ని నిర్మించనున్నారు. దీనిలో నుంచి లోపలికి వెళితే వేర్వేరు మండపాలు దర్శనమిస్తాయి. అక్కడి నుంచి లేపలికి వెళితే ఓంకారేశ్వర మందిరం ఉంటుంది. దీనిలోని గర్భాలయ గోపురాన్ని 64 అడుగులు ఎత్తు, 14 అడుగులు పొడవు, 14 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు. తెలంగాణలో యాదగిరిగుట్ట గర్భాలయం తర్వాత ఓంకారేశ్వర స్వామి గర్భాలయమే పెద్దగా ఉండబోతుందని ప్రభుత్వం చెబుతోంది.

**దాతలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో :** ప్రాజెక్టుకు రూ.700 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మూసీ నది అభివృద్ధి మొదటిదశలో ఆలయ నిర్మాణం భాగమని, వ్యయంలో దాతలు, ప్రైవేటు సంస్థలను భాగస్వామ్యం చేస్తామని ప్రభుత్వం అంటోంది. దీనిని పర్యాటకులు భక్తులు చేరుకునేందుకు వీలుగా ఓఆర్ఆర్ నుంచి ఈ మందిరానికి విశాలమైన రోడ్డు మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఆలయం వద్ద వెయ్యి నుంచి 2 వేల వాహనాలకు పార్కింగ్ వసతి కల్పిస్తామని పేర్కొంది. దిగువనున్న మూసీపై చిన్నపాటి ఆనకట్టను కట్టి నీటిని నిల్వ ఉంచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపింది. అక్కడ నది మధ్యలో దీనిపై నిల్చున్న 100 అడుగుల శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. చుట్టూ పార్కులను అభివృద్ధి చేసి, బోటింగ్, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

# మొయినాబాద్ డ్రగ్ కేసు - పక్కా ఆధారాలతో పోలీసుల విచారణ, నోరు విప్పని నిందితులు

**మత్తు పదార్థాల కొనుగోళ్లు, ఎప్పుడు ఎలా డెలివరీ అయింది?**

**నగదు బదిలీపై ఆధారాలతో ప్రశ్నించడంతో నిందితుల మౌనం**

**కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్, నగదు లావాదేవీల వివరాలు**



డ్రగ్స్ పార్టీ, కాల్పుల వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఇతర నిందితుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. డ్రగ్ పెడ్లర్లు, వారి సహాయకులుగా పనిచేసే వారితో నిందితుల్లో కొందరికి నేరుగా సంబంధాలు ఉన్నట్లు బయటపడుతోంది. పోలీసులు ఇందుకు సంబంధించి ఆధారాలు సేకరించారు.

**పక్కా ఆధారాలతో విచారణ :** మాదకద్రవ్యాలు, కాల్పుల కేసులో ముగ్గురు ప్రధాన నిందితులు రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీ వ్యాపారి నమిత్ శర్మను తొలిరోజు కస్టడీలో పోలీసులు ప్రశ్నించారు. హైదరాబాద్‌కు చెందిన డ్రగ్ పెడ్లర్ రాకేశ్‌వర్మ ఆదేశాలతో అభిషేక్‌సింగ్, మరికొందరి నుంచి మత్తు పదార్థాల కొనుగోళ్లు, ఎప్పుడు ఎలా డెలివరీ అయింది. నగదు బదిలీకి సంబంధించి పక్కా ఆధారాలతో ప్రశ్నించడంతో నిందితులు చాలాసార్లు మౌనం వహించినట్టు తెలుస్తోంది. కొన్ని రోజుల కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్, డబ్బు బదిలీకి, బ్యాంకు లావాదేవీల వివరాలను నిందితులకు చూపించడంతో విస్తుపోయినట్టు తెలుస్తోంది. రాకేశ్‌వర్మతో నిందితుల్లో కొందరు కాల్స్ మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని విషయాల గురించి గుర్తులేదని చెప్పగా పోలీసులు కొన్ని ఆధారాలు చూపించినట్లు సమాచారం.

**పోలీసుల ప్రశ్నలకు రోహిత్‌రెడ్డి మౌనం :** కోర్టు అనుమతితో ఈ కేసులో రిమాండులో ముగ్గురు నిందితుల్ని చంచల్‌గూడ నుంచి రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీ వ్యాపారి నమిత్ శర్మను కస్టడీకి తీసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం మినహా సాయంత్రం 7 గంటల వరకూ నిందితులను విచారించారు. కొద్దిసేపు న్యాయవాదుల సమక్షంలో ప్రశ్నించారు. తొలుత రోహిత్‌రెడ్డి, రితేశ్, నమిత్‌శర్మను వేర్వేరుగా విచారించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి కొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉన్నట్లు తెలిసింది.తొలుత డ్రగ్స్ పెడ్లర్లతో తనకెలాంటి సంబంధం లేదని రోహిత్‌రెడ్డి చెప్పగా పోలీసులు వాట్సాప్ కాల్స్, నగదు బదిలీలకు సంబంధించి లావాదేవీలను చూపించడంతో సమాధానం ఇవ్వలేదని తెలిసింది. ఆ తర్వాత ముగ్గుర్నీ కలిపి విచారించి మరికొన్ని సమాధానాలు రాబట్టారు. మద్యం మత్తులోనే కాల్పులు జరిపానని నమిత్‌శర్మ చెప్పినట్లు తెలుస్తోంది. తాము పోలీసులవైపు కాల్చాలని ఆదేశాలివ్వలేదని, మత్తులో విచక్షణ కోల్పోయి చేశాడని రోహిత్, రితేశ్ చెప్పినట్లు సమాచారం.

**పరారీలో ఉన్నవారి కోసం గాలింపు :** మధ్యాహ్నం వరకూ సిట్‌సభ్యులు యోగేశ్ గౌతమ్, శిరీష తదితరులు ప్రశ్నించగా ఆ తర్వాత సిట్ పర్యవేక్షకుడు ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు సమక్షంలో విచారణ జరిగింది. ఇతర నిందితులైన బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్‌రవి, వ్యాపారి అర్జున్‌రెడ్డి మరో ఇద్దరిని పోలీసులు విచారించారు. పరారీలో ఉన్న రాకేశ్‌వర్మ, అభిషేక్‌సింగ్, మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తొలిరోజు నిందితుల విచారణ అనంతరం సిట్ సభ్యులు డీసీపీ యోగేశ్ గౌతమ్, శిరీష, తెలంగాణ ఈగల్ డీఎస్పీలు, ఇతర అధికారులతో సుధీర్‌బాబు భేటీ అయ్యారు. విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు తదుపరి కార్యాచరణపై చర్చించారు.

**వారి మధ్య స్నేహం ఎలా మొదలైంది? :** మొయినాబాద్ ఫాంహౌజ్ డ్రగ్స్ పార్టీ కేసులో సిట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. మొత్తం 11 మంది నిందితుల మధ్య ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించిన అధికారులు, వారి బ్యాంకు అకౌంట్స్‌ను లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. నిందితుల్లో ఒక్కొక్కరిదీ వేర్వేరు ప్రాంతాలు, ఒక్కో వ్యాపారమైన వారి మధ్య స్నేహం ఎలా మొదలైంది? అసలు దీని వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలు, వ్యాపార సంబంధాలపై విచారిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి మార్చి 14వ తేదీన సాయంత్రం డ్రగ్స్ పార్టీ జరిగేటప్పుడు పోలీసులు వచ్చే ముందు తుపాకీతో కాల్పులు ఎందుకు జరపాల్సి వచ్చిందనే దానిపై నిందితులను పక్కా ఆధారాలతో విచారిస్తున్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు హైకోర్టులో ఊరట

**మాజీ ఐఏఎస్ పిటిషన్ కొట్టేసిన న్యాయమూర్తి**

**పవన్ కల్యాణ్‌కు హైకోర్టులో ఊరట**

**మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ పిటిషన్‌ను కొట్టివేత**

**సినిమాల్లో నటించకుండా నిలువరించాలని పిటిషన్**

**ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు సినిమాల్లో నటించడంపై నిషేధం లేదని తీర్పు**




డిప్యూటీ సీఎం బాధ్యతలను నిర్వహిస్తున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను సినిమాల్లో నటించకుండా నిలువరించాలంటూ మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను సినిమాల్లో నటించకుండా అడ్డుకోవాలని, సినిమా, వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకునేందుకు ఆయన ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఇటీవల జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది బాల వాదనలు వినిపించారు.పిటిషన్‌లో పేర్కొన్న వివరాలిలా! ఇందులో ప్రధానంగా ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తూ పవన్ సినిమాల్లో నటించడం అనైతికమని మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక వాణిజ్య కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. సినిమా టికెట్ ధర పెంపు విషయంలో నిబంధనలను పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఓవైపు సినిమాల్లో నటించడం, మరోవైపు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడం పరస్పర విరుద్ధమని పిటిషన్‌లో వివరించారు.అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివప్రతాప్ వేర్వేరు సందర్భాల్లో వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు వంటి ఉన్నత పదవుల్లో విధులను నిర్వర్తిస్తున్న వ్యక్తులు సినిమాల్లో నటించడంపై నిషేధం ఏమి లేదని హైకోర్టు తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి, సినీ సీనియర్ నటుడు ఎన్టీఆర్ విషయంలో హైకోర్టు విస్తృత ధర్మాసనం ఈ విషయమై స్పష్టమైన తీర్పు ఇచ్చిందని వివరించారు. సినిమా నిర్మాత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని హరిహర వీరమల్లు సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

**వ్యాజ్యాన్ని కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు:** అదే విధంగా టికెట్ ధరలు పెంచే విషయంలో ఉప ముఖ్యమంత్రికి సంబంధం లేదని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు ఆధారాలు లేవని కోర్టుకు తెలిపారు. పిటిషనర్‌కు రాజకీయ పార్టీ ఉందని రాజకీయ కారణాలతో దాఖలు చేసిన వ్యాజ్యం ఇది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు.ప్రాథమిక అంశాలపై పరిశీలన చేయకుండా పిటిషన్ దాఖలు చేసి, న్యాయస్థానం సమయాన్ని వృథా చేసినందుకు వ్యాజ్యాన్ని కొట్టేస్తూ పిటిషనర్‌కు భారీగా ఖర్చులు విధించండని కోరారు. ఇటీవల జరిగిన విచారణలో ఇరువైపు న్యాయవాదులు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి తాజాగా వ్యాజ్యాన్ని కొట్టేస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు.

**గతంలో సినిమాలపై పవన్ స్పందన:** పవన్ కల్యాణ్‌కు సినిమాల మీదున్న శ్రద్ధ, పరిపాలనపై లేదన్న వైఎస్సార్సీపీ నాయకుల విమర్శలపై డిప్యూటీ సీఎం తీవ్రంగా మండిపడ్డారు. వాళ్లు మాత్రం పత్రికలు, టీవీలు, బోలెడు బినామీ కంపెనీలు నడుపుతూ వ్యాపారాలు చేస్తారని ఇంక అనేక ఆదాయమార్గాలు పెట్టుకుంటారు కానీ తాను సినిమాలు మానేయాలా అని మండిపడ్డారు.వాళ్లను సిమెంట్ ఫ్యాక్టరీలు, వ్యాపారాలు మూసేయమనండని పవన్ అన్నారు. తాను సినిమా షూటింగ్‌లు చేయడమే కనిపిస్తుంది తప్ప, వాళ్లు చేసేది కనిపించదా అని ధ్వజమెత్తారు. వాళ్లలా తనకు ఆస్తులు, స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు లేవని, తప్పనిసరి పరిస్థితుల్లో సినిమాలు చేస్తున్నానని పవన్ వ్యాఖ్యానించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com